

మూలం : త్రివేణి

అనువాదం : శర్వాణి

కంపిస్తున్న పెదవులు - ఎఱ్ఱబారిన కళ్ళు - అస్థిరమైన నడక కుడి ఎడమలు చూడకుండా తిన్నగా వీచి వస్తున్న గాలిదుమారం వినత. ఆమె లోని కోపం ఆమెనే దహించివేస్తోంది. ఆమె హృదయంలోని నిరాశ

లోతు కొలవజాలనిది.

పురుషజాతిమీద ఆమె కున్న తిరస్కారం, క్రోధం — ఊహాతీతమైనవి. ఆమె తిరస్కారభావంముందు భూమి కూడా తేలికే.

"వచనద్రోహి - అరసికుడు - బాధ్యతలేని మనిషి..........." ఆమె శబ్దభండారం ఖాళీగా ఉంది. ఆ చోటును ఆమె క్రోధావేశాలు, నిరాశ నింపివేశాయి.

చేతిలో చెయ్యివేసి ఇచ్చినమాట ఏమయిందో. తనమాటనే నిలుపుకోలేనివాడు. ఇక ఏం చేయగలడు ?

అలాటి మనిషిని నమ్మిన తన మూర్ఖత కేమనాలి ?

అతడు ఎదురుగా లేనంత వరకు ఆమె కోపానికి పట్ట పగ్గాలు ఉండేవి కావు.

అతడు ఆమె ముందుకువచ్చినపుడు ఆకోపమంతా ఎక్కడికి పారిపోయేదో ! నవ్వుతూ అతడు పిలిస్తే ఆమె కోపమంతా మంచులా కరిగిపోయేది.

హుఁ. తన దౌర్బల్యాన్ని అతడు చక్కగా ఉపయోగించుకున్నాడు.

ఇకముందు ఆయన నవ్వుముందు ఉక్కులా చలించకుండా నిలబడాలి.

"వచనద్రోహి ........"

ఆమె తలలోని ఆలోచనలకూ, కాళ్ళకూ సంబంధమే లేనట్టుంది.

ఆలోచనల్తో బుర్రపగిలిపోతోంది. కాళ్ళు వాటి కిష్టమొచ్చినట్టు నడుస్తున్నాయి.

ఓ పార్కులోకి ప్రవేశించాక నే వినతకు తెలివి వచ్చింది.

పచ్చటి ఆకులతోనిండిన వేపచెట్టూ, దాని చుట్టూ వృత్తాకారంలో ఉన్న రాతిబెంచీ, వేపకొమ్మలు చేతులుచాచి ఆమె నాహ్వానించాయి. క్రోధంతో కంపిస్తున్న వినతకు ఆ చల్లటిగాలి సోకి చెవిలో మృదువుగా సాంత్వన వచనాలు పలికినట్టనిపించింది.

ఒక్క నిమిషం హాయనిపించింది వినతకు. కొంగుతో మొహం తుడుచుకుంది.

అది సంధ్యా సమయం. ఆరు దాటింది. రంగు రంగుల సీతాకోకచిలుకలతో నిండిన పార్కు ఆమె కళ్ళకు విందు చేస్తోంది.

ఆకాశంలో ఎగిరే సీతాకోకచిలుకలు కాదు - ఎగిరి గంతులు వేసే సీతాకోకచిలుకలు - వాళ్ళనవ్వులు అలలుగా తేలి వస్తున్నాయి. అందరి మొహాల్లోనూ మందహాసం మెరుస్తోంది.

ప్రపంచ మంతా ఒక ఉత్సవంలో పాల్గొంటున్నట్టుగా ఉంది.

తాను ఒక్కతే దుఃఖితురాలు.

ఈ వెండివృత్తంలో తను నల్లటి చుక్క.

బాలికల గుంపొకటి గట్టిగా కేకలు

వేసుకుంటూ వినత కూర్చున్నచోటికి వచ్చింది.

వాళ్ళందరూ పన్నెండువసంతాలు కూడా చూడని ముగ్ధబాలికలు.

రంగురంగుల పరికిణీలు, జాకెట్లు, ఫ్రాకులతో రంగురంగుల అలల్లాగ వినత కళ్ళముందు తేలివస్తున్నారు.

" ఏం ఆట ఆడుకుందాంఇప్పుడు."

"రెక్కాట"

"తొక్కుడుబిళ్ళ"

"ఉహుఁ వద్దు. దొంగాటాడుదాం"

"ఆఁ, దొంగాట ఆడదాం" అని పదికంఠాలు ఏకంగా అరిచాయి.

"సరే, చప్పట్లు వేద్దాం పట్టండి. ఎవరు దొంగో........"

ముగ్గురు ముగ్గురు జట్టుగా నిలబడి చప్పట్లు వెయ్యసాగారు.

వినతలోని దుఃఖం కుతూహలానికి చోటిచ్చి వెనుకకు జరిగింది.

సుమారు పదేళ్ళక్రితం తనూ ఇలాగే ఆడుకునేది.

ఎంత మార్పు !

అప్పటి ఆనందపక్షికి నేడు దుఃఖ జలంతో తడిసి ముద్దయిపోయిన బరువైన రెక్కలు.

వినత ఆ బాలికలనే చూస్తూ కూర్చుంది.

పీలగా, నల్లగా ఉన్న ఎనిమిదేళ్ళ పిల్ల తనూ చప్పట్లు వెయ్యాలని ఆత్రంతో ముందుకు వచ్చింది.

"లీలా ! నువ్వురాకు. నువ్వుతల్లిగా ఉందువుగాని ......"

ఆ మాటతో లీల అక్కడే ఆగిపోయి "ఉహుఁ .... నేనూ....వస్తాను .... " అంటూ ప్రతిఘటించింది లీల.

"ఇంట్లో అమ్మచెప్పింది అప్పుడే మరిచిపోయావా ? పరిగెత్తకూడ దని చెప్పలేదూ ? "

"ఊఁ.... ఊఁ...."

"అయితే నువ్వు ఆటకు రానక్కర్లా. వస్తే "తల్లి"గా ఉండాలి."

అది లీలఅక్కయ్య అధికారవాణి.

ఎనిమిదేళ్ళలీల తల్లిగా రాతిబెంచి మీద కూర్చుని ఆఖరున మిగిలిన పిల్ల కళ్ళు మూసి "ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్." అని అరవ సాగింది.

పిల్లలంతా ఉత్సాహంతో ఆడుతున్నారు.

వాళ్ళ చిట్టిపాదాలు గడ్డిని తొక్కి త్రోవలోని దుమ్మును పైకి రేపుతున్నాయి.

శారద, చంపకం, నీరజ, శాంతి, విమల అందరికీ కళ్ళుమూసి "ఎక్కడి దొంగ లక్కడే గప్‌చుప్"అని అరచి అరచి లీలకు విసుగనిపించింది. ప్రతీ ఆటలోనూ తనే "తల్లి"గా ఉండాల్సి రావటం తనకు మహా చికాగ్గా ఉంది.

ఆఖరికి తన అక్కయ్యకే కళ్ళు మూయవలసి వచ్చినపుడు నెమ్మదిగా అడిగింది.

"నేనొక్కసారి ఆడతానక్కయ్యా"

"వద్దు. అమ్మ చెప్పలేదూ - 'నువ్వు పరిగెత్తకూడదు. ఊరికే కూర్చోవాలి' అని. నన్ను తిడుతుంది తరువాత - లీల నెందుకు చేర్చుకున్నావే అని"

"ఒక్కటంటే ఒక్కసారి...."

"వీల్లేదు."

లీల నోరు మూసుకుంది. చెల్లెలి విషయంలో అక్క చాలా కఠినంగా ఉన్నట్టనిపించింది వినతకు. జాలితో లీలవైపు చూసింది.

ఆ చిన్నదేహంలో ఎముకలు ఎత్తుగా కనిపిస్తున్నాయి. అంత ఉక్క పోస్తున్నా నిండు చేతుల స్వెట్టరు వేసుకునే ఉంది. ఆట చూస్తున్న కొలది ఆ పిల్లలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. కాని ఆటలో పాల్గొనే అవకాశంలేక బాధ పడుతోంది. అది చూడలేక వినత అడిగింది.

"నువ్వెందుకు ఆడుకోవు పాపా?"

"అమ్మ తిడుతుంది."

"నువ్వువెళ్ళిఆడుకో. కావాలంటే నేను తల్లిగా ఉంటానులే."

"ఒద్దండీ," అంది లీల.

"నేను మీఅక్కయ్యతో చెప్తాలే."

"ఒద్దండీ, అక్కయ్య ఒప్పుకోదు."

ఆ పిల్లలందరిలోనూ చిన్నదైన లీలను తల్లిగా కూర్చోబెట్టి వాళ్ళంతా ఆడుకోవడం వినతకో సమస్యగా పరిణమించింది.

వినత మళ్ళీ లీలను పలకరించేటంతలో పిల్లలంతా వచ్చి "తల్లి"ని ముట్టుకున్నారు.

మామిడికాయ లమ్మే కుఱ్ఱాడు అటు రావటంతో వారి ధ్యాస అటు మరలింది. "మామిడికాయలూ.... ఇటురా" అని పిలిచారు. కొన్ని మామిడికాయలు కొన్నారు అందరూ కలిసి. ఆ కుఱ్ఱవాడే మామిడికాయలను చాకుతో కోసి ఉప్పు కారప్పొడి వేసి ఇచ్చాడు. ఆముక్కలను అందరూ పంచుకున్నారు.

లీల అక్కయ్యవెంట బడింది.

"నాకు ఒక ముక్క పెట్టవూ. కాస్తే కాస్త. మళ్ళీ అడగనుగా." అంటూ బ్రతిమాలుకుంటూనే ఉంది.

కాని అక్కయ్య చెల్లెలి మాటలు వినిపించుకోనేలేదు.

వాళ్ళంతా తింటూఉంటే ఆ పిల్ల నోట్లో నీళ్ళూరుతున్నాయి.

"అక్కయ్యా, నాకు...."

"మామిడికాయ ఇమ్మంటున్నావ్? వారంక్రితం మామిడికాయ తిని బాధపడింది మరిచిపోయావా?

"చిన్న ముక్క...."

"అప్పుడు ఎన్ని ఇంజక్షనులు పొడిపించుకొన్నావో గుర్తుందా?"

"ఊఁ....ఊఁ....చిన్నముక్క...." లీల గొంతులో ఏడుపు కనిపిస్తూనే ఉంది. ఆది చూడలేక ఓ అమ్మాయి ఒక ముక్కతీసి "తీసుకో" అంది.

లీల అక్కయ్య దర్పంతో, "ఒద్దు, లీల కివ్వకు, అమ్మ తిడుతుంది."అంది.

అమ్మపేరు వినగానే గరుడపక్షిని చూసిన సర్పంలాగా లీల మెత్త బడింది.

అందరూ మామిడిముక్కలు తిని నీళ్ళు త్రాగటానికి పంపు దగ్గరకు నడిచారు. లీల బరువైన అడుగులు వేస్తూ వాళ్ళవెంటనే నడిచింది. వరుసగా అందరూ నీళ్ళు తాగాక తనూ నీళ్ళకోసం దోసిలి పట్టింది.

కాని అంతలో అక్కయ్య ధ్వని లీలను ఆపేసింది.

"చన్నీళ్ళు తాగకే. అమ్మతో చెప్తానుండు."

పాపం చిన్నిలీలకు అడుగడుగునా అడ్డంకులే.

"చాలాదాహం వేస్తోందక్కయ్యా"

"ఇంట్లో కాచి చల్లార్చిన నీళ్ళు తాగుదువుగాని."

దోసిలిలోని నీళ్ళు కింద పోసేసి ఆశతో నీళ్ళవేపే చూస్తూ ఎండిన పెద వులను నాలుకతో తడుపుకుంది.

పిల్లలంతా మళ్ళీ వినత కూర్చున్న రాతిబెంచీ దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చారు.

అక్కడ ఓఅమ్మాయి చక్రా లున్న కుర్చీలో కూర్చున్న విషయం గమ నించి అందరూ ఒక్క నిమిషం ఆ అమ్మాయినే చూస్తూ నిల్చున్నారు.

ఆ పిల్ల ధనవంతుల ఇంటిపిల్ల అని తొడుక్కున్న ఖరీదైనగుడ్డలు అడగ కుండానే చెప్పుతున్నాయి.

ఆ ముద్దుమొహంలోని మెరిసేకళ్లు కుతూహలంతో ఆ పిల్లలవంక చూశాయి. వికసిస్తున్న గులాబి మొగ్గలా ఆ పిల్ల పెదవులమధ్య చిరు నవ్వు తొంగిచూసింది. ఉంగరాల జుత్తు పైకి ఎగురుతూ తనఉత్సాహాన్ని ప్రదర్శిస్తోంది. వజ్రాల జూకాలు తళ తళా మెరుస్తూ ఊగుతున్నాయి. కళ్ళుమాత్రం వయసుకు మించిన గాంభీర్యంతో సగం మూసుకుని వున్నాయి.

మెరిసిపోతున్న పట్టుపరికిణీ కాళ్ళను పూర్తిగా కప్పివేసింది.

ఎనిమిదేళ్ళ బాలిక తను.

వికసించబోతున్న ఈ మొగ్గ తన అందం అలంకారాలతో అందరినీ

తనవైపుకు ఆకర్షించుకుంది - ఒక్క నిమిషం.

మళ్ళీ తమ ఆటల్లో మునిగి పోయారు.

"లీలా, ఈ సారి శారదకు కళ్ళు మూయాలి నువ్వు -" ఓ పిల్ల గుర్తు చేసింది లీలకు.

లీల మళ్ళీ తన యథాస్థానంలో కూర్చుని శారదకు కళ్ళు మూసింది, తను ఇంకా తినకుండా ఉంచుకున్న మామిడిముక్కను లీలదగ్గర ఉంచి,

"ఇది ఎవరూ తినకుండాచూసుకో, ఆటయ్యాక తింటాను" అంది. పళ్ళు లేని అమ్మమ్మదగ్గర చేగోడీలు దాచి వెళ్ళే మనుమడిలా.

"నేను తినేస్తే" అంది - లీల కొంటెగా.

"ఊహుఁ. నువ్వు తినవులే. నాకు తెలుసు, తింటే మీ అక్కయ్యతో చెప్తాను.

"ఈ కాపలా ఈ జన్మకు వద్దురా బాబు" అనిపించింది లీలావతికి.

చెయ్యి తియ్యగానే శారద పారి పోయింది.

లీల ఇప్పుడు చక్రాల కుర్చీపైన కూర్చున్న అమ్మాయివైపు తనదృష్టి పోనిచ్చింది. స్నేహంకోసం అలమ టిస్తున్న ఆ పిల్ల లీలను చూసి నవ్వి,

"నీ పే రేమిటి ?" అంది.

"లీల. నీ పేరు ?"

"శ్యామల. లీలా ! నీకు బిస్కట్లు పెట్టనా, మామిడికాయకు బదులుగా ?"

"ఒద్దు"

"ఫరవాలేదు తీసుకో-" శ్యామల బలవంతంచేసి గ్లాక్సో బిస్కట్టు ప్యాకెట్ లోంచి తీసి ఇచ్చింది. జిహ్వా చాపల్యాన్ని ఆపుకోలేక దానిని తీసు కుంది లీల.

బిస్కట్టు తీసుకున్నాక లీల తన స్నేహాన్ని చూపించడానికోసం,

"అక్కకు చెప్పి ఈ సారి ఆటలో నిన్నూ చేర్చుకునేటట్టుచేస్తాను" అంది.

"ఒద్దు లీలా."

"ఏం నీకు ఆడటం ఇష్టంలేదా"

"దొంగాట ఆడటానికి ఇష్టం లేని వాళ్ళుకూడా ఉంటారా ?"

"అయితే మరి ఆడవేం ?"

"ఊహుఁ. నువ్వే వాళ్ళతో ఆడుకో. నీకు బదులు నేనే తల్లిగా ఉంటాను."

తల్లి కావటానికి ఇద్దరు చిన్నపిల్లలు పోటీపడుతున్నారు.

"అక్కయ్య నన్ను ఆడనివ్వదు. అందుకే ప్రతిఆటకూ నేనే తల్లిగా వుంటాను."

శ్యామల తన అందమయిన కళ్ళను లీల కాళ్ళపైనే నిలిపి,

"నీ కాళ్ళు బాగున్నాయి. మరి!" అంది ఆశ్చర్యంతో.

"ఉహుఁ. అందుకాదు. ఇపుడు ఎక్కువగా తిరిగితే రాత్రి బాగా ఉబ్బసం, దగ్గు వచ్చేస్తుంది. అందుకే అమ్మ నన్ను ఆడనివ్వదు. అక్కయ్యకూ చెప్పిపంపుతుంది, నన్ను ఆటలో చేర్చుకోవద్దని."

"ఉబ్బసం అంటే ?"

లీల హృదయంలో అలలు వువ్వెత్తున ఎగిరాయి.

ఓహ్ ! శ్యామల ఎంత భాగ్యశాలి ! తను అనుభవించే నరకబాధ ఏమిటో తెలియనివారు కూడా ఉంటారా? రాత్రిపూట హాయిగా తలగడమీద తలపెట్టుకుని నిద్రపోయే వారు ఎంత పుణ్యాత్ములో కదా !

దగ్గు లేదు - ఉబ్బసం - లేదు - మామిడిముక్కలు తినవచ్చు - చన్నీళ్లు తాగొచ్చు - దొంగాట ఆడవచ్చు. ఓహ్ !

"ఉబ్బసం అంటే ఏమిటి ?" శ్యామల మళ్ళీ అడిగింది.

"అంటే....అంటే....ఊపిరి వదలడానికి పీల్చడానికి కాకుండా అడ్డుపడి బాధ పెడుతుంది."

"ఎక్కడ ?"

"గొంతులో"

"ఎలా ?"

ఊపిరి గొంతులో బిగబట్టి గాలి కోసం నోరుతెరుచుకుని బాధపడుతూ "ఇలా" అంది లీల.

సర్వవ్యాపితమైన గాలి లీల శ్వాసనాళాన్ని ప్రవేశించలేదు.

"ఓ ! " అంది శ్యామల ఇంకేమనడానికీ తోచక.

"అందుకే నేను చెపుతున్నాగా ! ఈ సారి ఆటలో నువ్వు చేరు. ఏం ?"

"లేదు లీలా. నేను ఆడను"

"ఏం ?"

"నాకు తిరగటానికి అవదు"

"నీకూ ఉబ్బసం వస్తుందా ?"

"లేదు. నా చిన్నప్పుడు అంటే నాలుగేళ్ళప్పుడు ఏదో జబ్బు చేసి ఎడంకాలు చచ్చుబడిపోయింది"

"అంటే కాలు లేదా ?" లీల అమాయకంగా ప్రశ్నించింది.

లీల ఎంత అదృష్టవంతురాలు ! తను నాలుగేళ్ళుగా అనుభవిస్తున్న నరకయాతన ఏమిటో తెలియదు. ఆమెకు తనలాగా చేతికఱ్ఱగాని, చక్రాల కుర్చీకాని అక్కర్లేదు. ఆమెకు పరిగెత్తడానికి వీలుపడకపోయినా నడవగలదు.

"కాలు ఉందికాని నడవలేను."

"ఏదీ చూపు ?"

శ్యామల తన పరికిణీని కొద్దిగా పక్కకు తీసిచూపించింది. ఎడమకాలు మడమదగ్గరనుండి తొడదాకా పట్టీలు వేసి కట్టిఉంది.

"ఓ" అంది లీల. మాటల్లో చెప్పలేని మూగ సాను భూతి నదిలా ప్రవహించి ఆ రెండు పసిహృదయాలను ఏకం చేసింది.

శ్యామల చక్రాలకుర్చీని నెట్టుకుంటూ లీలదగ్గరకువచ్చి, "రేపు నేను వస్తాను. నువ్వూ వస్తావా ?" అంది.

"అలాగే తప్పకుండా రా"

శ్యామల,లీలల స్నేహానికి సాక్షిగా వినత కూర్చుని ఉంది.



ఎగిరి గంతులు వేయాల్సిన పిల్లలు- శ్యామల, లీల.

ఒకరికేమో చక్రాల కుర్చీయే ఆధారం. దాని ఆసరా లేక ఏపనీ చేయ లేదు. ఇంకొకరు ఎన్నో విధాల సుఖాల నుండి వంచితురాలు.

ఈ చిన్న వయసులోనే వారిద్దరూ అనుభవిస్తున్న వేదనకు అంతులేదు.

కాని తనో ?

దేవుడు తనకు కావలసినంత ఐశ్వ ర్య. ఆరోగ్యాలను ప్రసాదించాడు.

ఒక క్షుద్రమైన కారణానికి మనసు పాడుచేసుకుంటే ఎవ రేం చేయగలరు?

శ్యామల, లీలల ముందు తన బాధ ఎంత అల్పమైంది !

ఎంత మూర్ఖురాలు తను !

అదే ఆఖరిరోజై సినిమాకు తన్ను తీసుకుని వెడతానని మరీ మరీ చెప్పి వెళ్ళిన భర్త వేళకు ఇంటికి రాలేదన్న కోపంతో పురుషజాతినే నిందిస్తూ ఇంటికి తాళం వేసి పిచ్చిదానిలా వచ్చే సిందామె.

"ఆయిన ఇంటికి వచ్చిఉంటారో ఏమో'' అనుకుంటూ ఇంటివైపు నడిచింది వినత.

★

